క్లుప్తంగా

బోనమెత్తిన చిట్యాల



బోనాలతో తరలివస్తున్న మహిళలు

అడవిదేవులపల్లి: మండలంలోని చిట్యాల గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకంగా తీసుకొచ్చిన నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి. నాగేంద్ర, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొత్త మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన పది మంది సీపీఎం కార్యకర్తలు బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ నాగేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాదూరి కిరణ్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రెమడాల కరుణాకర్, యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పృథ్వీరెడ్డి, సీనియర్ నాయకులు పాండు, హరికృష్ణ, శ్రీకాంత్, ఆంజనేయులు, యాకోబు, సురేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 29 నుంచి ఎస్‌పీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ జట్ల పేర్లను 28వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ విజేతకు రూ.30వేలు, రన్నరప్ జట్టుకు రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.11వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9666099961, 9885553580 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

హాలియా: అనుముల మండలంలోని రామడుగు గ్రామంలో గల వరలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామశాఖ అధ్యక్షులు, వార్డు సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జోడో యాత్రకు తరలిన కాంగ్రెస్ నేతలు



అడవిదేవులపల్లి నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

అడవిదేవులపల్లి: వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామం నుంచి ఆదివారం మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టి హాత్ థ్ హాత్ జోడో యాత్రకు అడవిదేవులపల్లి మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోపగాని హనుమంతు, బండి నాగేశ్వర్‌రావు, అన్నబోయిన మల్లిఖార్జున్, శ్రీధర్, మునీనాయక్ తదితరులున్నారు.

దర్వేశిపురం ఆలయం వద్ద భక్తుల సందడి

కనగల్: మండలంలోని దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి సతీమణి పద్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ జల్లేపల్లి జయరామయ్య, అర్చకులు మల్లాచారి, శ్రవణాచారి, సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, లింగస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ లేక కష్టాలు

- ఎండలోనే నిల్చుంటున్న ప్రయాణికులు
- బస్సుల కోసం ఉరుకులు, పరుగులు



రోడ్డు పక్కన నిలబడి బస్సు కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

పెద్దవూర: మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో దశాబ్దాల కాలంగా ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారితో పాటు జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి సైతం మండల కేంద్రం ప్రధాన కూడలిగా ఉంది. అనుముల మండల ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాలన్నా పెద్దవూరకు వచ్చి వెళ్తుంటారు. ఆంధ్రా ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి ఆంధ్రా ప్రాంతానికి బస్సులు పెద్దవూర మీదుగా వెళ్తుంటాయి. దీంతో ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా పెద్దవూరకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో పాత ఎంపీడీఓ కార్యాలయం ముందు బస్ షెల్టర్ ఉండేది. రోడ్డు విస్తరణలో భాగంగా దానిని అధికారులు తొలగించారు. అప్పటినుంచి ప్రయాణికుల కష్టాలు మొదలయ్యాయి.

ట్రాఫిక్‌కు ఇబ్బంది

బస్టాండ్ లేకపోవడంతో బస్సులు రోడ్డు పక్కనే ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. రోడ్డు పక్కన ఎక్కువ స్థలం లేకపోవడంతో బస్సులు రోడ్డు మధ్యలోనే ఆపుతున్నారు. ప్రయాణికులు ఎక్కి, దిగే వరకు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. బస్సు వెళ్లే వరకు వెనకాల వాహనాలు ఆగాల్సి వస్తుంది.

నిలువ నీడ కరువు

ప్రయాణాలు చేసే ప్రజలు బస్సుల కోసం పెద్దవూర మండల కేంద్రానికి ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వస్తారు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్ల వెంట నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. మండలంలోని పలు గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చిపోయే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఎండలకు ఎండుతూ, వానలకు తడుస్తూ రోడ్ల వెంట నిరీక్షిస్తుంటారు. వర్షాలకు, ఎండలకు తాళలేక దుకాణాల ముందు నిల్చోవటానికి దుకాణ యజమానులు దుకాణాలకు అడ్డంగా ఉంటున్నారని తిడుతుంటారని విద్యార్థులు వాపోతున్నారు. చేసేది లేక రోడ్డు వెంట నిల్చుంటున్నట్లు పేర్కొంటున్నారు. రాత్రి సమయాలలో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుంది. ఆంధ్రా ప్రాంతానికి వెళ్లటానికి రాత్రి సమయాలలోనే బస్సులు అధికంగా ఉంటాయి. దీనికి తోడు హైదరాబాద్ నుంచి వచ్చే వాళ్లు రాత్రి సమయంలో హాలియా తదితర ప్రాంతాలకు వెళ్లటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం మిర్యాలగూడ పరిసర ప్రాంతాలలో సిమెంట్ పరిశ్రమలు, రైస్ మిల్లులు అధికంగా ఉండటం, నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక ప్రాంతం కావడంతో నిత్యం ఈ రహదారిపై వందలాదిగా వాహనాలు వెళ్తుంటాయి. బస్టాండ్ లేక ప్రయాణికులు రోడ్ల వెంట నిల్చోవాల్సి వస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందో అని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్ల వెంట నిల్చుంటున్నాం



బస్టాండ్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్ల వెంటనే నిల్చోవాల్సి వస్తుంది. దుకాణాల ముందు నిలబడదామని అనుకున్నా దుకాణదారులు పరుష పదజాలంతో తిడుతున్నారు. వాళ్ల తిట్లను భరించే కన్నా రోడ్డు పక్కన ఉండటమే మేలని ఎండలోనే నిల్చుంటున్నాము. బస్సులు రోజు ఒకే చోట ఆపకుండా దూరంగా ఆపుతున్నారు. దీంతో భుజాన పుస్తకాల సంచులు వేసుకుని బస్సు వెంట ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తుంది.

– కె. పావని, 9వ తరగతి, చింతపల్లి

ధర్మభిక్షం జీవితం ఆదర్శనీయం



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దేవరకొండ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో బొమ్మగాని ధర్మభిక్షం 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ధర్మభిక్షం చేసిన సేవలను కొనియాడారు. సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన మహాయోధుడు ధర్మభిక్షం అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జూలూరి వెంకట్రాములు, పల్లా రంగారెడ్డి, బెజవాడ లక్ష్మయ్య, వహాబ్, లాలయ్య, బుచ్చయ్య, వెంకటయ్య, జాకీర్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చింతపల్లి వాగు నుంచి డిండికి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, పక్కా సమాచారం మేరకు పోలీసులు డిండి గ్రామ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు కరోనా కేసులు నమోదు

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం రెండు కరోనా కేసులు నమోదైనట్లు మండల వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిలో ఒకరు గ్రామపంచాయతీ వర్కర్ కాగా, మరొకరు ప్రభుత్వ ఉద్యోగి అని ఆమె పేర్కొన్నారు.

బాధ్యతారహితంగా వ్యవహరించడం సరికాదు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 23న నిర్వహించిన జాతీయ గ్రామీణ అవార్డుల ప్రదానోత్సవానికి చింతకుంట్ల గ్రామ సర్పంచ్ హాజరుకాకపోవడమే కాకుండా, ఆ తర్వాత అతడు మాట్లాడిన మాటలు బాధ్యతరాహిత్యమని ఆ గ్రామ ఉప సర్పంచ్ యేకుల సురేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి సర్పంచ్ హాజరుకాకపోవడంతోనే తాను అవార్డును స్వీకరించినట్లు పేర్కొన్నారు. అనవసరమైన ఆరోపణలు చేయకుండా గ్రామాభివృద్ధికి కలిసి రావాలన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంగ్యానాయక్, ఉప సర్పంచులు చంద్రయ్య, మోత్యానాయక్, యేకుల శ్రీను, యేకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులయ్యే బీఆర్ఎస్‌లోకి..

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన 50మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకల అరుణాసురేష్‌గౌడ్, వైస్ చైర్మన్ రహత్‌అలీ, వేముల రాజు, రయిస్, జయప్రకాష్ తదితరులున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



క్రీడాకారులతో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

హాలియా: విద్యార్థులు, యువత, మహిళలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాలియా పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి మహిళా కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కబడ్డీకి ప్రస్తుతం దేశస్థాయిలో మంచి ఆధరణ లభిస్తుందన్నారు. మహిళలు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్‌తో పాటు ఉన్నత స్థానాలకు ఎదగడానికి మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. మహిళలు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగినప్పుడే గెలుపు సాధ్యపడుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా చూడాలని అన్నారు. అనంతరం కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్సీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కృష్ణారెడ్డి, కోచ్‌లు శ్రీనివాస్, భాస్కర్‌రావు, నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ జి. కర్తయ్య, సూర్యాపేట జిల్లా సెక్రటరీ నామా నర్సింహారావు, నల్లగొండ జిల్లా జాయింట్ సెక్రటరీ డోమ్నిక్, పీడీ వెంకట్రామిరెడ్డి, పీఈటీలు యడవెల్లి రాంబాబు, పరమేష్, సైదులు, నరేష్, సురేష్, నాగరాజు, లెనిన్, అన్వర్, రాము, కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీబీఐతో విచారణ జరిపించాలి



నిరాహార దీక్షలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

దేవరకొండ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర కృష్ణ, అధ్యక్షుడు రమావత్ రమేశ్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం బీఎస్పీ దేవరకొండ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే బర్తరఫ్ చేయడంతో పాటు బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ సర్వసాధారణం అని మాట్లాడిన మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డిని అరెస్ట్ చేసి గతంలో జరిగిన పరీక్షలపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సహానీ, లలిత, ప్రకాష్, దయాకర్, శ్రీకాంత్, ఇమ్రాన్, జాన్, బాలూనాయక్, దత్తునాయక్, కళ్యాణ్, తరుణ్ తదితరులున్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న భట్రాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు సరికొండ నరసరాజు

మిర్యాలగూడ టౌన్: భట్రాజులు తమ హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని భట్రాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు సరికొండ నరసరాజు అన్నారు. ఏప్రిల్ 2వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న సంఘం రాష్ట్ర సభలకు సంబంధించి ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణాలో భట్రాజులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారని అన్నారు. తమ హక్కుల సాధన కోసం భట్రాజులు రాజకీయాలకతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భట్రాజుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. అర్హులందరికీ ఇండ్ల స్థలాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా భట్రాజుల సంఘం యువజన నూతన కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకునేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంగెళ్ల పిచ్చంరాజు, కార్యదర్శి సరస్వతి, శంకర్‌రాజు, బొల్లెపల్లి శ్రీనివాసారాజు, కారంపూడి సత్యనారాయణరాజు, కూరపాటి రామరాజు, బొల్లెపల్లి వెంకటేశ్వర్‌రాజు, సత్యనారాయణరాజు, సరస్వతి, పుల్లంరాజు, రఘు, నాగరాజు, మాధవరాజు తదితరులున్నారు.

ఏప్రిల్ 3న బార్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏప్రిల్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి ఏచూరి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు రడపంగ సతీష్, మంద సైదులు తెలిపారు. ఆదివారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం బార్ అసోసియేషన్ కాలపరిమితి అయిపోయినందున తిరిగి 2023–2024 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం 4గంటల వరకు బార్ అసోసియేషన్ సభ్యత్వం తీసుకునే అవకాశం ఉందన్నారు. 28వ తేదీ ఉదయం 11గంటలకు ఓటరు జాబితాను విడుదల చేసి, అదే రోజు మధ్యాహ్నం 12గంటల నుంచి 29వ తేదీ సాయంత్రం 4గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. 31వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, ఏప్రిల్ 1, 2వ తేదీల్లో ప్రచారం నిర్వహించుకునేందుకు సమయం కేటాయించినట్లు తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఓటింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి వెంకట్

మిర్యాలగూడ టౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి వెంకట్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ పార్కు స్కూల్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లు తొలగించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. సంఘం బలోపేతానికి యువకులు కృషిచేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు దైద సత్యం మాదిగ, నాయకులు కత్తుల సూర్యనారాయణ, ఉబ్బపల్లి కాశయ్య, కొమ్ము శ్రీనివాస్, దైద సోము సుందర్, కొడిరెక్క మట్టయ్య, రామకృష్ణ, కొడిరెక్క చిన్నప్ప, ఉబ్బపల్లి రాజశేఖర్, శ్రవణ్, గూడపురి శ్రీనివాస్ తదితరులున్నారు.

బండపాలెం చేరిన సీతారామచంద్రుల విగ్రహాలు



కేతేపల్లి: ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు

కేతేపల్లి: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 28 నుంచి నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామం నుంచి సీతారామచంద్రుల విగ్రహాలను ఆదివారం కేతేపల్లి మండలంలోని బండపాలెం గ్రామానికి తీసుకువచ్చారు. ప్రతిఏటా బండపాలెం గ్రామంలో గల గుట్టపై నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణం సందర్భంగా ఉత్సవ విగ్రహాలను చందుపట్ల నుంచి తీసుకురావడం ఆనవాయితీ. ఈసందర్భంగా మహిళలు దేవతామూర్తులకు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికి నీళ్లారబోశారు. విగ్రహాలను స్థానిక గుట్టపై గల ఆలయంలోకి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారం మీనారెడ్డి, సర్పంచ్ వంగూరి జయమ్మప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చందుపట్ల నుంచి బండపాలెం వరకు..

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో డప్పుచప్పుళ్లు, కోలాటం ప్రదర్శనతో కేతేపల్లి మండల బండపాలెం గుట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ వారం రోజులపాటు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించి కల్యాణం తరువాత తిరిగి చందుపట్లకు చేరుస్తారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల ఆలయ చైర్మన్లు మేడవరపు కిషన్‌రావు, మారం మీనారెడ్డి, ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, నాయకులు వెంకటేషం, దోసపాటి వెంకటనారాయణ, యానాల శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, వడ్డెబోయిన యాదగిరి, మంగినపల్లి వెంకటయ్య, గంగుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారమ్మ తల్లి జాతర



జాతరలో కోలాటం ఆడుతున్న యువకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని యల్లాపురం తండాలో ఆదివారం గిరిజనుల ఆరాధ్య దైవం మారమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి గొర్రెపొట్టేళ్లను బలిచ్చారు. కారు, ఆటో యూనియన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. యువకుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కారు, ఆటో యూనియన్, హైదరాబాద్ నాయకులు, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్, గ్రామస్తులు కొర్ర భాస్కర్, వెంకటేశ్వర్లు, రఘునాయక్, లాల, స్వామి, లాలు, శ్రీను, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తేనే మద్దతు



నినాదాలు చేస్తున్న మిర్యాలగూడ జిల్లా సాధన సమితి నాయకులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు కోసం కృషిచేసే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో ప్రజలు మద్దతు తెలుపుతారని జిల్లా సాధన సమితి నాయకులు చేగొండి మురళీయాదవ్, వజ్రగిరి అంజయ్య అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకి వినతిపత్రాలు అందించామని, వారందరూ సానుకూలంగా స్పందించారని అన్నారు. రానున్న రోజుల్లో జిల్లా ఏర్పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఉద్యమంలో అన్ని పక్షాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు వెంకన్న, వంశీ, కిరణ్, గురువయ్య, కిషన్, దాసరి వంశీ, నవీన్‌నాయక్, సాయినాయుడు, హరినాయుడు, మధుబాబు, నీలకంఠనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : ఈ నెల 27న భాస్కర్‌టాకీస్ సెంటర్‌లో నిర్వహించే జన చైతన్య యాత్ర సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు తుమ్మల పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శ్రీనగర్‌కాలనీలో యాత్ర పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుజిత్, లక్ష్మి, దుర్గాప్రసాద్, సౌమ్య, మహేష్, శివ పాల్గొన్నారు.

నేడు చిట్యాలకు ప్రజా చైతన్య యాత్ర

చిట్యాల: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సోమవారం సాయంత్రం చిట్యాలకు చేరుకుంటుందని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో మే 15, 16,17, 18వ తేదీల్లో బొడ్రాయి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం నల్లగొండ రోడ్డులోని విజయలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

నల్లగొండ టూటౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో సంఘమిత్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ముందంజలో ఉందని ఆ బ్యాంక్ ఫౌండర్ అండ్ చైర్మన్ సంగం రామకృష్ణ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బ్యాంక్ 49వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 1097 మంది ఖాతాదారులతో రూ.131.06 లక్షల వాటాధనం కలిగి ఉందని, 3039 మంది నుంచి రూ.75.76 కోట్ల డిపాజిట్లు సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్లు రాఘవరావు, పల్లాటి శైలజ, డైరెక్టర్లు, సీఈఓ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలకులను గద్దె దించాలి

కేతేపల్లి: కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న అవినీతి ప్రభుత్వాలను గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని గుడివాడ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండా జలంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేఖనంలో బంగారు పతకం



శతమన్యు

మిర్యాలగూడ టౌన్: మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని తమ్ముల పల్లి కళాక్షేత్రంలో ఆలిండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన న్యాయవాది బట్టు వెంకటేశ్వర్లు, డాక్టర్ రమాదేవి దంపతుల కుమారుడు బట్టు శతమన్యు పాల్గొని బంగారు పతకం సాధించాడు. పల్లెటూరు చిత్రాలు వేసిన శతమన్యుకు నిర్వాహకులు బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేసినట్లు డ్రాయింగ్ మాస్టర్ యినుగుర్తి విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- పురివిప్పిన మయూరం



చింతపల్లి మండల కేంద్రంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ చల్లని వాతావరణానికి ఓ నెమలి అటవీ ప్రాంతం నుంచి జనావాసాల మధ్యకు వచ్చి పురివిప్పి నాట్యమాడింది. ఈ దృశ్యాన్ని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

– చింతపల్లి